శిక్షణతో ఉత్తమ నైపుణ్యం


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, డాక్టర్ అసాది శ్రీనివాసులు

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ప్రపంచ స్థాయి కంపెనీలలో పోటీ పడగల నైపుణ్యం పెంపొందించుకోవచ్చని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ సీఎస్ఈ, ఐటీ, ఏఐ అండ్ డీఎస్ విభాగాలలో ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అన్ని రంగాలను ప్రభావితం చేస్తూ, విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందన్నారు. ఏఐ దాని అనుబంధ అప్లికేషన్స్ అయినా మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, వారిని ఇండస్ట్రీ అవసరాలకు తగ్గట్లుగా తయారు చేయగలదని, గ్లోబల్ వరల్డ్‌లో విద్యార్థులను ఉన్నత స్థితిలో నిలిపి వారికి మంచి భవిష్యత్తును, మంచి ప్యాకేజీ పొందేలా ఉపయోగపడుతుందన్నారు. లైబీరియా మోన్రోవియాలోని బ్లూక్రెస్ట్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ అసాది శ్రీనివాసులు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దాడి వీరయ్య, డాక్టర్ బి.శ్రీనివాసరావు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ ఎస్ జయప్రద కన్వీనర్స్‌గా వ్యవహరించారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి

మొర్సుమల్లి(మైలవరం): విద్యార్థులు తమలో దాగివున్న నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని గ్రామ సర్పంచ్ రమాదేవి పేర్కొన్నారు. మైలవరం మండలం మొర్సుమల్లి తండాలోని ఎంపీపీ పాఠశాలలో కేఎల్ యూనివర్సిటీ స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు హస్తకళ, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎంపీపీ పాఠశాల గోడలపై బొమ్మలు వేస్తున్న విద్యార్థులు

ఈ-క్రాప్ నమోదులో జాగ్రత్త వహించాలి

రోలుపడి(తిరువూరురూరల్): ఖరీఫ్ పంటల సాగు చేసే పొలాలను ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవడంలో రైతులు తగు జాగ్రత్త వహించాలని తిరువూరు మండ ల వ్యవసాయాధికారి పద్మ సూచించారు. మండలంలోని రోలుపడిలో సోమవారం ఈ-క్రాప్ నమోదుపై రైతులకు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అవగాహన కల్పించారు. రైతు పొలం వద్దకు వెళ్లి మాత్రమే జియో ట్యాగింగ్ చేయాలని, ఈ-క్రాప్ నమోదుకు సెప్టెంబరు 15వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని చాటుదాం


పెనుగొలనులో హర్‌ఘర్ తిరంగా ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రదర్శన


మూలపాడులో అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించిన జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీదేవి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని సమాజానికి చాటుదామని జెడ్పీ వైస్ చైర్ పర్సన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. మూలపాడులో నాభూమి నాదేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం సోమవారం జరిగింది. యుద్ధ వీరుల స్ఫూర్తికి చిహ్నంగా శిలాఫలకాన్ని సర్పంచ్ భూలక్ష్మీతో కలిసి ఆమె ఆవిష్కరించి మొక్కలు నాటారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా

పెనుగొలను(గంపలగూడెం): స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గంపలగూడెం మండలం పెనుగొలనులో షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ''హర్ ఘర్ తిరంగా'' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాను సారం ఆగస్టు15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్న ఆలోచనను ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జాతీయ జెండాలు పట్టుకుని భారత్ మాతాకీజై అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధులు కోటగిరి వెంకటకృష్ణారావు చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విశ్రాంత ఎంఈఓ శేషిరెడ్డి, గ్రంథాలయ అధికారి వి.జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు ఏవీ నరసింహారావు, పి.రవికుమార్, జై రామలక్ష్మణ, రెండు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు, సాయిబాబా సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తిరువూరు: తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు వేణు తెలిపారు. ఈ నెల 28న సాయంత్రం ఐదు గంటలకు తిరువూరులో బయల్దేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా 29వ తేదీ రాత్రి అరుణాచలం చేరుతుందని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ అనంతరం 30న తిరిగి బయల్దేరి శివకంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి మీదుగా తిరువూరుకు సెప్టెంబర్ ఒకటో తేదీ ఉదయానికి చేరుతుందని తెలిపారు. అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98856 61835లో సంప్రదించాలని కోరారు.

నేడు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ

తిరువూరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో, వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఎమ్మెల్యే రక్షణనిధి జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ తదితర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు.

చేప బెల్లం ద్రావణంతో చీడపీడల నివారణ

చంద్రగూడెం(మైలవరం): చేప బెల్లం ద్రావణం (ఫిష్ ఎమైనో యాసిడ్)తో పంటలలో చీడపీడలు నివారించవచ్చని ఏపీసీఎన్ఎఫ్ ఇన్‌చార్జి శాంతి కుమారి సోమవారం తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెంలోని రైతు ఇంటి వద్ద సుమారు 60 లీటర్ల చేప బెల్లం ద్రావణం తయారు చేశామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) ఇన్‌చార్జి శాంతికుమారి మాట్లాడుతూ చేపబెల్లం ద్రావణం అన్ని రకాల పంటలపై పిచికారి చేయడంతో పాటు ప్రమోటర్‌గా వాడుకోవడానికి, చీడపీడల నివారణకు వాడుకోవచ్చన్నారు. ఈ ద్రావణం పిచికారి చేయడం వలన చెట్ల కొమ్మలు గుబురుగా రావడం, పీలకలు బాగా వేయడం, కాయలు సైజ్ పెరగడం వంటి ఇంకా ఎన్నో రకాలు ఉపయోగాలు ఉన్నాయని రైతులకు వివరించారు. అంతేగాక తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చన్నారు.


చేప బెల్లం ద్రావణం తయారీ విధానం వివరిస్తున్న శాంతికుమారి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీ పరిధిలో డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం చేశారు. డ్వాక్రా మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.19,178కోట్లు నిధులు సున్నా వడ్డీ కింద జమ చేసినందుకు కృతజ్ఞత భావంగా క్షీరాభిషేకం చేశారు. సున్నా వడ్డీతో పాటు రూ.3లక్షల వరకు రుణాలు అందించే దిశగా అడుగులు వేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని డ్వాక్రా మహిళలు పేర్కొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సాంబశివారెడ్డి, అంకమోహనరావు, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, చిన్నయ్య, కె.వెంకటరత్నం, కొండపల్లి పార్టీ కన్వీనర్ శరభయ్య, కౌన్సిలర్లు శ్రీనివాస్, వెంకయ్య నాయుడు, కె.గురవయ్య పాల్గొన్నారు.


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వసంత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు, నాయకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మైలవరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేరీ మాటీ మేర దేశ్ కార్యక్రమం సోమవారం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటడం ముఖ్యమైన పరిణామం అని పేర్కొన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవం సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఫణికుమార్, ఫిజికల్ డైరెక్టర్ మన్నే స్వామి పాల్గొన్నారు.


మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

'నాగార్జున' కాలేజీలో ఫ్రెషర్స్ డే

తిరువూరు: స్థానిక నాగార్జున జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సోమవారం సీనియర్లు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థినుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కరస్పాండెంటు వేమూరి నాగేశ్వరరావు, చైర్మన్ దిరిశాల హనుమంతరావు పాల్గొన్నారు.


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఉచిత కంటి పరీక్షలు

విస్సన్నపేట: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయం వద్ద విజయవాడకు చెందిన మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాల్టీ కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి పరీక్షలు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ పి.నాగేశ్వరరావు సిబ్బంది ఉషారాణి, కె.నారాయణ కంటి పరీక్షలు నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నల్లంటి సూరిరాజు, కార్యదర్శి మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు, కోశాధికారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు నాగేశ్వరరావు

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్య మైదానంలో నిర్మాణం జరుపుకుంటున్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం స్మృతి వనం పనులను సోమవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ అధికారులతో కలిసి పరిశీలిచారు. సుందరీకరణ పనులను ఎక్కడెక్కడ ప్రారంభించాలో పరిశీలించి అధికారులకు సూచించారు. హరితహారంలో మొఘల్ గార్డెన్ ల్యాండ్ స్కేపింగ్ భాగాలు, వెదురు ఫ్రేమ్‌లో బొగెన్విలేయా మొక్కలు, గులకరాయి నమూనాలు, జాతీయ పక్షి నెమలి ఆకృతిని అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అంబేడ్కర్ చూపుడువేలును అత్యంత జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్నభోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ

ముష్టికుంట్ల(తిరువూరురూరల్): మండలంలోని ముష్టికుంట్ల ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తిరువూరు మండల విద్యాశాఖాధికారి-2 రామకృష్ణ సోమవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలన్నారు. నాణ్యతా లోపం ఉంటే చర్యలు తప్పవని వంట ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. విద్యార్థులను భోజన నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం శేషగిరి రావు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

గంపలగూడెం(తిరువూరు): మండలంలోని పెనుగొలను గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాంబాబు కథనం మేరకు.. పెనుగొలను గ్రామానికి చెందిన మోటపోతుల శ్రీకాంత్ (20)కు ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వైద్యుడు పసుపులేటి శ్రీనివాస్ వద్దకు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ డాక్టర్ ఇంజక్షన్ చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తెలంగాణ రాష్ట్రంలోని మధిర పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే శ్రీకాంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆర్ఎంపీ వైద్యుడు చేసిన ఇంజక్షన్ వికటించినందునే తన కుమారుడు మృతి చెందాడని తండ్రి మోటపోతుల అనమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు కబేళా, చేపల మార్కెట్లు, మాంసపు దుకాణాలకు సెలవు

పటమట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని కబేళాకు సెలవు ప్రకటించామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి నుంచి కబేళాలో జంతువులను వధించటం నిషేధించామని నగరంలో ఉన్న అన్ని చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లు అన్నీ మాంసం విక్రయాలకు అనుమతి లేదని ప్రకటనలో పేర్కొన్నారు. నిషేధ సమయంలో జీవాలను వధించినా, మాంసం దుకాణాలు ఓపెన్ చేసినా, విక్రయించినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీలకంఠేశ్వరస్వామికి అన్నాభిషేకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో సోమవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన మాసశివ రాత్రి పూజలు ఘనంగా జరిగాయి. నీలకంఠేశ్వర స్వామికి అర్చకులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన మాస శివరాత్రి, సోమవారం కలిసి రావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర, అన్నపూర్ణ దేవస్థానం సోమవారం అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీ గురు గ్రహ పాశుపత మహా రుద్రహోమం, సర్వ దేవత హోమాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, పల్లకి సేవ, శాంతి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి నూతక్కి వెంకట సాంబశివరావు పర్యవేక్షణలో హోమాలు జరిగాయి.

మేథమేటిక్స్‌లో నైపుణ్యం పెంచుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మేథమేటిక్స్‌లో నైపుణ్యం పెంచుకుంటే ఎటువంటి పోటీ పరీక్షల్లోనైనా సులభంగా విజయం సాధించవచ్చని యూసిమస్ సంస్థ సీఈవో డాక్టర్ స్నేహల్ కార్య చెప్పారు. గుంటూరులోని అమరావతి రోడ్డులో ఉన్న బీవీఆర్ కన్వెన్షన్‌లో యూసిమస్ ఏడో రాష్ట్ర స్థాయి పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. స్నేహల్ కార్య మాట్లాడుతూ మేథమేటిక్స్‌లో నైపుణ్యం సాధిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని చెప్పారు. యూసిమస్ సంస్థ ఏపీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరెడ్డి, సంస్థ విజయవాడ బ్రాంచ్ హెడ్ పూర్ణిమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందచేసి అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భార్య అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 204కు చెందిన సింధి ఏసుపాదం, పార్వతి భార్యభర్తలు. వీరికి ఐదుగురు సంతానం. భార్యభర్తలిద్దరు రైళ్లలో ఇయర్ ఫోన్స్, ఇతర సామగ్రి అమ్ముతుంటారు. ఈ నెల 9వ తేదీన ఏసుపాదం వ్యాపారం కోసం బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో భార్య కనిపించకపోవడంతో పిల్లలను అడగగా, బయటకు వెళ్లిందని చెప్పారు. పార్వతి ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారు, స్నేహితులను అడిగినా ఫలితం లేదు. తన భార్య కనిపించడం లేదంటూ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఓం బాన్‌క్విట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేషధారణ పోటీలో చిన్నారులు ధరించిన దుస్తులు ఆహూతులను అలరించాయి. జాతీయ పతాకంలోని మూడు రంగులతో కూడిన చీరెను ఒక బాలిక ధరించగా, త్రివర్ణ పతాకాన్ని చేబూని ఒక బాలిక, గాంధీ, లాయర్, గోపిక, వివేకానందుడు, సుభాష్ చంద్రబోస్ వంటి పలు వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథి అరుణాచలేశ్వర స్వామి ఆర్య వైశ్య అన్నదాన సత్రం వైస్ ప్రెసిడెంట్ మద్దాల శ్రీనివాస్ కుమార్ విచిత్ర వేషధారణ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని రగిలిస్తూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో గుర్రం చిన్న నాగ ఉదయ్ శంకర్, పేర్ల వెంకట సాయి కృష్ణ, డాక్టర్ గుర్రం వెంకట సుబ్బారావు, గుర్రం ఈశ్వర్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా పనిచేయాలి

నూజివీడు: సహకార ఉద్యోగులు కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా పనిచేయాలని ఏలూరు జిల్లా సహకారశాఖ అధికారి పేర్కొన్నారు. డీఆర్ కార్యాలయానికి సోమవారం విచ్చేయగా ఆయన్ను సొసైటీ ఉద్యోగులు పలువురు కలిశారు.













సర్పంచ్ బరిలో ముగ్గురు అభ్యర్థులు

ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని అడవినెక్కలం సర్పంచ్ ఎన్నికల బరిలో ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఉప ఎన్నిక షెడ్యూల్‌లో భాగంగా సోమవారం నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ నిర్వహించారు. సర్పంచ్ పదవికి ఐదుగురు నామినేషన్ వేయగా, వారిలో రాజ్యం, రాజేష్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో పిల్లి శేషయ్య(మంచం గుర్తు), పులపాక చిన్న బ్బాయి (కత్తెర గుర్తు), వేము రాజు (ఉంగరం గుర్తు) పోటీలో నిలిచారు. ఈ నెల 19న పోలింగ్, కౌంటింగ్‌ను కూడా నిర్వహించి ఫలితాన్ని ప్రకటిస్తారు.

నాలుగు వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవం

ఈదులగూడెం పంచాయతీలో ఏడో వార్డు సభ్యుని ఎన్నిక ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారి చాముండేశ్వరి తెలిపారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని కందుల మంగమ్మకు అందజేశారు. ఎస్‌ఐపేటలో నాలుగో వార్డు సభ్యుడి పదవి, కృష్ణవరంలో ఏడో వార్డు సభ్యుని పదవులు సైతం ఏకగ్రీవమయ్యాయి.













విద్యార్థులకు ఆటల పోటీలు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి హైస్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు ఆటలు, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. హెచ్ఎం రాధికారాణి మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు బహుమతులు అందజేస్తామన్నారు. పీడీ రవీంద్ర, మోహన్‌రావు, విఠల్‌బాబు, రంగారావు, బాలు, మల్లేశ్వరి, కోటేశ్వరమ్మ, కృష్ణవేణి, మనోహరం, సౌజన్య పాల్గొన్నారు.

వేల్పుచర్ల వార్డు సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవం

ముసునూరు: వేల్పుచర్లలో పదో వార్డు సభ్యుడికి సంబంధించి ఒక నామినేషన్ దాఖలు కావడంతో దుక్కిపాటి మహేశ్వరరావు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముసునూరులోని 11వ వార్డుకు కె.వనిత, కె.నలోమి బరిలో మిగిలారు. కాట్రేనిపాడులో 10వ వార్డుకు పి.రంగారావు, కాజ రాజ్యలక్ష్మి పోటీలో నిలిచారు.















స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలియజేద్దాం

ముసునూరు: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేద్దామని వైస్ ఎంపీపీ రాజానాయన, గంగాధర్, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకలు 2023లో భాగంగా ప్రభుత్వం ఆరంభించిన నా భూమి-నాదేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం వేడుకలు ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.

'స్పందన' అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

నూజివీడు: 'స్పందన'లో వచ్చిన అర్జీలను అధికారులు సకాలంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 22 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఏసీడీపీఓ నాగేశ్వరి, ఎస్సై జగ్జీవన్‌రావు, ఆర్అండ్‌బీ ఏఈ అశోక్ పాల్గొన్నారు.







